క్లుప్తంగా

రూరల్‌లో నేడు 'వెన్నుపోటు దినం' నిరసన


చెల్లుబోయిన వేణు

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా.. ఇచ్చిన హామీలు అమలు చేయని కారణంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. బుధవారం ఉదయం 9.30కు బొమ్మూరులోని పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకుంటామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు ప్రజల పక్షాన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

7న నర్సరీలో యోగా దినోత్సవం


యోగా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న పీడీ దుర్గేష్

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడియపులంకలోని పుల్లా చంటియ్యకు చెందిన శ్రీసత్యదేవ నర్సరీలో ఈ నెల 7వ తేదీన యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమ ఏర్పాట్లపై అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్, డీటీవో వెంకటాచలం, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుజా, తహసీల్దార్ సునీల్‌కుమార్, నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ ఈ సమీక్షలో పాల్గొన్నారు. యోగా దినోత్సవంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతితో పాటు, ప్రముఖులు పాల్గొంటారు. 7వ తేదీ ఉదయం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, నర్సరీ రైతులు పాల్గొనాలని అయ్యప్ప కోరారు.

తీర్థయాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

రాజమహేంద్రవరం సిటీ: అరుణాచల గిరి ప్రదర్శనకు ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో నుంచి ఈ నెల 10వ తేదీన ప్రత్యేక బస్సును నడపనున్నట్టు డిపో మేనేజర్ షేక్ షబ్నం మంగళవారం తెలిపారు. నాలుగు రోజుల యాత్రలో భాగంగా 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు బస్సు ఇక్కడి నుంచి బయలుదేరుతుందన్నారు. అరుణాచలం, కాణిపాకం, తిరుపతి క్షేత్రాల దర్శనం ఉంటుందన్నారు. 27న అరుణాచలం, రామేశ్వర యాత్రకు బస్సు పయనమవుతుందని చెప్పారు. ఈ యాత్రలో కాణిపాకం, శ్రీపురం, పళని, అరుణాచలం, కొయంబత్తూరు, ఊటీ, మైసూరు, గురువాయూర్, త్రివేండ్రం, రామేశ్వరం, కన్యాకుమారి, మధురై, శ్రీరంగం, తంజావూరు క్షేత్రాలను దర్శించేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. వివరాలకు 99666 66544, 95023 00189 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్


వృద్ధులకు బియ్యం అందజేస్తున్న ఆర్డీవో

రాజమహేంద్రవరం రూరల్: దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ బియ్యం, సరకులు అందజేస్తారని రాజమండ్రి ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన బొమ్మూరులోని రేషన్ షాపు–19 పరిధిలో 65 ఏళ్లు దాటిన లబ్ధిదారులకు ఇంటి వద్దే రేషన్ సరకులు పంపిణీ చేయడాన్ని పరిశీలించారు.

మహిళపై కర్రతో దాడి

సీతానగరం: ఇంట్లో ఉన్న మహిళపై కర్రతో దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు, రాపాకకు చెందిన కోమలి సుబ్బలక్ష్మి భర్త శంకరం సోమవారం ఉదయం సైకిల్‌పై వెళుతూ భూరపు చంద్రశేఖర్ ఇంటి వద్ద పడిపోయాడు. దీనితో చంద్రశేఖర్, శంకరం మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి, ఘర్షణకు దారి తీసింది. దీంతో తన భర్తపై గొడవ పడుతున్న చంద్రశేఖర్‌ను సుబ్బలక్ష్మి మందలించింది. ఆగ్రహించిన చంద్రశేఖర్ ఆమె ఇంటికి వెళ్లి కర్రతో దాడి చేశాడు. గాయపడిన సుబ్బలక్ష్మి రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చేరింది. ఆస్పత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రామ్‌కుమార్ తెలిపారు.

పర్యా'హ'రణం

- వరి గడ్డిని కాల్చడానికే రైతుల మొగ్గు
- భూమికి నష్టం అంటున్న వ్యవసాయ నిపుణులు
- ఖాతరు చేయకపోవడంపై సర్వత్రా ఆందోళన


వరి చేనులో ఎండు గడ్డిని తగులబెడుతున్న రైతులు

కడియం: పంట కోతలు పూర్తయ్యాక వరి గడ్డిని కాల్చడానికే రైతులు మొగ్గుచూపుతున్నారు. భూమికి నష్టం కలుగుతుందని నిపుణులు మొత్తుకుంటున్నప్పటికీ.. తాత్కాలిక ప్రయోజనాలకే రైతులు ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో వందలాది ఎకరాల్లో వరి గడ్డిని కాల్చి బూడిదచేస్తున్నారు. తద్వారా భూసారానికి, పర్యావరణానికి కూడా ముప్పు వెంటాడుతోంది. అత్యధిక శాతం మంది రైతులకు దీనిపై పూర్తి స్థాయి అవగాహన లేకపోవడంతో ఈ తంతు ప్రతి పంటకాలం పూర్తయ్యాక కొనసాగుతోందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తాత్కాలిక ప్రయోజనం

ప్రస్తుతం వ్యవసాయ భూములను సాగు చేస్తున్న వారిలో కౌలుదారులే అత్యధికం. దీంతో తాము సాగు కోసం తీసుకున్న భూమిలో పంటను తీసుకునేందుకు మాత్రమే రైతులు ప్రాధాన్యమిస్తున్నారు. దీర్ఘకాలంగా భూమి ఆరోగ్యం, పర్యావరణానికి జరిగే నష్టాలను గురించి ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఎండగడ్డిని చేలలో నుంచి తీసి, గడ్డిమేటుగా వేసుకునేందుకు అయ్యే ఖర్చులను కూడా పరిగణనలోకి తీసుకుంటే.. కాల్చడమే ఎటువంటి ఖర్చు లేకుండా అయిపోతుందన్న భావన వారిలో వ్యక్తమవుతోంది. ఎకరా భూమిలో ఎండుగడ్డిని సేకరించి, మేటుగా వేయడానికి దాదాపు రూ.6 వేల నుంచి రూ.8 వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. పాడిపై ఆధారపడే రైతులు కూడా తగ్గిపోవడంతో ఎండుగడ్డి ప్రాధాన్యం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో సాగుకు సిద్ధం చేసుకునే కార్యక్రమాల్లో భాగంగా ఎండుగడ్డిని కాల్చివేస్తున్నారు.

నియోజకవర్గంలో..

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని రూరల్, కడియం మండలాల్లో దాదాపు నాలుగు వేల హెక్టార్లలో వరి పంట సాగవుతోంది. ఇందులో 30 శాతం లోపే ఎండుగడ్డిని సేకరించినట్లు అంచనా. మిగిలినదంతా రైతులు తగులబెడుతున్నారు. సంప్రదాయబద్ధంగా గడ్డిని కుళ్లబెట్టేందుకు కూడా సమయం ఎక్కువ తీసుకుంటోందని రైతులు చెబుతున్నారు. వరి రకం, విపరీతమైన పురుగు మందుల వినియోగం, యంత్రాలతో కోతల కారణంగా వరి దుబ్బులు తొందరగా కుళ్లడం లేదని విశ్లేషిస్తున్నారు. వేసవి దుక్కులు, రెండు సార్లు దమ్ము చేయడం ద్వారా ఎంత కఠినమైన వరి దుబ్బు అయినా నేలలో కలిసి కుళ్లుతుందని, అతి తక్కువ మంది మాత్రమే వేసవి దుక్కులను వేస్తున్నారని కొందరు సీనియర్ రైతులు అంటున్నారు. వరి గడ్డిని ఏటేటా కాల్చడం కారణంగా క్రమంగా పంట దిగుబడిపై ప్రభావం తప్పదని వారు అభిప్రాయపడుతున్నారు. అయినప్పటికీ సాగు విధానంలో వచ్చిన మార్పులు, కౌలుదారీ విధానం, ఖర్చులను పరిగణనలోకి తీసుకుంటే వరి గడ్డిని కాల్చడమే సులభమైన పనిగా రైతులు భావిస్తున్నారని చెబుతున్నారు.

అవగాహన పెంచాలి

రైతులు సాగు చేసే భూముల్లో వరి గడ్డిని తగలబెట్టకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. దీర్ఘకాలంలో పంట దిగుబడి తగ్గిపోతుందని తెలియకే రైతులు ఇలా చేస్తున్నారు. కాల్చడం వల్ల కలిగే నష్టాలను సాగుకు ముందే వివరించడం మేలు.

– టి.అన్నవరం, రైతు

పశువులు లేకపోవడంతో..

వ్యవసాయంతో పాటే పశువుల పెంపకం కూడా ఉండేది. అప్పుడు ఎండుగడ్డికి ప్రాధాన్యం ఇచ్చేవారు. పాడి పశువులను పెంచడం భారీగా తగ్గిపోవడంతో ఇప్పుడు ఎండుగడ్డికి కూడా అవసరం తగ్గింది. నిప్పు పెడితే సులభంగా చేనును శుభ్రం చేయవచ్చన్న ఉద్దేశంతో రైతులు ఉన్నారు. నష్టాలను గురించి ఆలోచించడం లేదు.

– పి.సత్యనారాయణమూర్తి, రైతు, వేమగిరి

ప్రమాద ఘటనపై మాజీ ఎంపీ భరత్ దిగ్భ్రాంతి


భౌతికకాయాలకు నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్


శివ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

కవలగొయ్యిలో మృతుల కుటుంబాలకు పరామర్శ

రాజమహేంద్రవరం రూరల్: వడిశలేరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందిన ఘటనపై మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. మంగళవారం కవలగొయ్యికి చెందిన తీగిరెడ్డి శివ, అతడి కుమార్తె సాన్వి మృతదేహాలకు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జక్కంపూడి పరామర్శ

వడిశలేరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కవలగొయ్యి గ్రామానికి చెందిన తీగిరెడ్డి శివ, అతడి కుమార్తె సాన్వి మృతదేహాలను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి సందర్శించి, నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


చిత్రలేఖన పోటీని పర్యవేక్షిస్తున్న శ్రీలక్ష్మి

కంబాలచెరువు: ప్రస్తుత తరుణంలో పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా స్వీకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి అన్నారు. పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్.శ్రీలక్ష్మి పర్యవేక్షించారు. విజేతలకు ఈ నెల 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా జడ్జి బహుమతులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం, డ్రాయింగ్ టీచర్ పుప్పాల బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మరమ్మతుల కోసం బుధ, గురువారాల్లో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఈఈ నక్కపల్లి శామ్యూల్ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాయుడుపాకలు, కోలమూరు, కొంతమూరు గ్రామాల్లోని పరిమినగర్, బొమ్మన కాలనీ, కల్యాణ్‌నగర్, ఆదర్శనగర్, ఎంప్లాయీస్ కాలనీ, జంగాల కాలనీ, పంచాయతీ ప్రాంతం, సాయిరాం కాలనీ, శేషాద్రి లేఅవుట్, క్వారీ ఏరియా, కంటిపూడి లేఅవుట్, 14 ఎకరాల లేఅవుట్, బీసీ కాలనీల్లో అంతరాయం ఉంటుందన్నారు. గురువారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చెరుకూరి ఏరియా, విద్యానగర్, వీవర్స్‌కాలనీ, స్కేటింగ్ పార్కు, గణేష్ నగర్, కంటిపూడి రామారావు స్కూల్, వద్దాది హాస్పిటల్, ఆర్ట్స్ కాలేజీ వెనుక ఏరియా, కంబాల చెరువు, జోడు మేడల ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఉదయం 7.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ప్రకాశం నగర్, సుబ్బారావుపేట, కందుకూరి రాజ్యలక్ష్మి కాలేజీ, ఎస్‌కేవీటీ స్కూల్ ఏరియాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

అలసత్వాన్ని సహించేది లేదు

ఉచిత సీట్లపై డీఐ దిలీప్‌కుమార్



కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేందుకు నిర్దేశించిన 25 శాతం ఉచిత సీట్ల విషయంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అర్బన్ పరిధిలోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యా హక్కు చట్టం 12(1)సి ప్రకారం ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలు, బలహీనవర్గాల పిల్లలకు సమీప ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వ సిలబస్ అనుసరిస్తున్న అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు ఉచితంగా ప్రభుత్వం కేటాయించిందన్నారు. అర్హులైన వారికి విధిగా అడ్మిషన్ ఇవ్వాల్సిందేనన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాల ఆవరణలో పాఠ్య పుస్తకాలు, యూనిఫాం విక్రయించరాదని ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఫీజు వసూలు చేయాలని, ఫీజు వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. పాఠశాలలో విధిగా కంప్లైంట్ బాక్స్ ఉండాలన్నారు. బస్సులను నిర్వహించే వారు వాహన ఫిట్‌నెస్ సరిచూసుకోవాలని డ్రైవర్లకు సూచించాలన్నారు. విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా టాయిలెట్ సౌకర్యం విధిగా ఉండాలన్నారు. సమావేశంలో అర్బన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనపై ర్యాలీ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

సీతానగరం: మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఏవీకే చైతన్య, డాక్టర్ ఈ.యేసురాణి, డాక్టర్ కె.సునీల్ ఆధ్వర్యంలో మంగళవారం మలేరియా నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ యేసురాణి మాట్లాడుతూ, మలేరియా వ్యాధిని అశ్రద్ధ చేస్తే, క్రమంగా మెదడుకు సోకి ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందన్నారు. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. జనావాసాల్లో నీటిగుంతలు లేకుండా చూసుకోవాలన్నారు. పలువురు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చదరంగ పోటీలు


చదరంగ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం చెస్‌మాస్టర్ కంచుమర్తి జగన్నాథం విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. సాధు జనార్దన చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సాధు వెంకట కోటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో జీవన నైపుణ్యాల పోటీలు జరిగాయి. ట్రస్ట్ సభ్యులు బొడ్డు శ్రీనివాసు, పాడిపిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఐ దిలీప్‌కుమార్‌కు సత్కారం


డీఐ దిలీప్‌కుమార్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

కంబాలచెరువు: ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డు గ్రహీత, రాజమహేంద్రవరం అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్‌ను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు స్థానిక సంఘ కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. నిబద్ధత, క్రమశిక్షణతో విద్యా శాఖ కార్యక్రమాలను నూరు శాతం విజయవంతంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. విద్యారంగంలో ఆయన చేస్తున్న ఉత్తమ సేవలకు ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డు లభించిందన్నారు. ఆయనకు గజమాల వేసి, దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం దిలీప్‌కుమార్ మాట్లాడుతూ, ఈ అవార్డు తన బాధ్యతలను మరింత పెంచిందన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ వారికి, అలాగే దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ సంఘాల వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు తాళ్లూరి బాబూ రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి, దారా ఏసురత్నం, ఎం.కృపావరం, సిద్దగిరి, కుంచే దానవాయిబాబు, జంగం సుబ్బారావు, ఎ.కుమార్‌బాబు, దారా సుందరరావు, మిట్టపల్లి సుధీర్, రాయి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడితో గురుమూర్తిరెడ్డి భేటీ


జక్కంపూడి విజయలక్ష్మికి శాలువా కప్పుతున్న గురుమూర్తిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యురాలు, అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మిని పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి మంగళవారం ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితులపై ఆమెతో చర్చించారు. ఆయనతో పాటు మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పార్టీ నాయకులు, ప్రముఖ న్యాయవాది గొందేసి శ్రీనివాసులురెడ్డి, ఏపీ స్టేట్ కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు మద్దాల తిరుపతిరావు(అను) ఉన్నారు.

రేపు ఏపీజీఈఏ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

కడియం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం విజయవాడలో గురువారం జరుగుతుందని సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్‌ఎస్ విల్సన్‌పాల్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన ఉద్యోగుల సమావేశంలో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విల్సన్‌పాల్ మాట్లాడుతూ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతారన్నారు. రూరల్ నుంచి భారీగా ఉద్యోగులు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వీఎస్ రాజు, పి.మురళీకృష్ణ, కె.శ్రీనివాసరెడ్డి, వై.శాంతిరాజు, టి.మణిశ్రీ, వి.ఉమ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు


కరకుదురులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాద్

పెదపూడి: రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని రాజమహేంద్రవరం కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎల్‌కే ప్రసాద్ అన్నారు. కరకుదురు గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ ఎల్‌కే ప్రసాద్, కలవచర్ల కృషి విజ్ఞాన్ కేంద్ర శాస్త్రవేత్తలు నాగేశ్వర్‌రెడ్డి, రవీంద్రహరీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ, డ్రోన్ సాయంతో రాబోయే రోజుల్లో పురుగు మందులు పిచికారీ చేసే విధంగా రైతులకు మరింత సాంకేతికత ముందుకు తీసుకొస్తామన్నారు. నానో యూరియా వంటి ఎరువులను డ్రోన్ సాయంతో ఎకరానికి 500 ఎంఎల్ పిచికారీ చేయవచ్చన్నారు. తద్వారా యూరియా మోతాదు ఎకరానికి తగ్గించవచ్చని, చీడపీడల ఉధృతిని నివారించవచ్చన్నారు. వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తూ తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధించే విధంగా పథకాలు రూపొందించామన్నారు. పెద్దాపురం రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు మాధవి మాట్లాడుతూ, రైతులు తప్పనిసరిగా ఎకరానికి పాతిక కేజీల పటాస్ వాడాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ మాట్లాడుతూ, జూన్ ఒకటిన ఖరీఫ్ సీజన్‌కు నీటిని విడుదల చేశారన్నారు. రైతులు నీటిని సద్వినియోగం చేసుకుని, విత్తనాలు, నారుమడులు, దమ్ములు తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాగునీటి డీసీ చైర్మన్ సానా శ్రీనివాసు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిర్రా వరప్రసాద్, మాజీ సర్పంచ్ దత్తుడు, తోటకూర వెంకటేశ్వరరావు, ఆరుమిల్లి వాసు, అబ్బాయి చౌదరి, ఉద్యాన వన శాఖ అధికారి సుజాత, ఏఈఓ జయశంకర్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ దివ్య, రైతులు పాల్గొన్నారు.

మళ్లీ.. పరేషన్


బర్మాకాలనీలో: ఇంకెంత దూరం నడవాలి బాబూ..

మళ్లీ పాత రోజులు మొదలయ్యాయి. రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు.. ఎప్పుడు తెరుస్తారో తెలియదు.. సర్వర్ మొరాయింపులు.. నో స్టాక్ బోర్డులు.. కాళ్లకు పుండ్లు పట్టేలా రేషన్ సరకులు మోసుకెళ్లడం.. ఇలా పుట్టెడు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. గడప ముంగిటకే రేషన్ సరకులు చేరే బృహత్తర పథకానికి సర్కారు ఫుల్‌స్టాప్ పెట్టేసింది. దీంతో బస్తాల కొద్దీ బరువులను భుజాన మోసే దుస్థితి దాపురించింది. నడుం పట్టేసి.. కాళ్లు ఈడ్చుకుంటూ సరకులను తీసుకెళ్లాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం పుణ్యమా అని రాజమహేంద్రవరం నగరంలో రేషన్ కష్టాలు దృశ్యరూపంలో ఆవిష్కృతమయ్యాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం


లలితానగర్‌లోని రేషన్ షాపు వద్ద రేషన్‌కార్డుదారులకు తప్పని క్యూ కష్టాలు


పదండి.. మోసుకుపోదాం..


చీకటి పడింది.. మా నంబర్ ఎప్పుడో..!


వామ్మో.. నడుం పట్టేస్తోంది బాబోయ్..